## పురోహిత పరిషత్

"పెండ్లి కూతురు మారిపోయిందా? దానికి మేం జవాబుదారీనా? యిదెక్కడి అసోద్యం? నా యిరవై మూడేండ్ల సర్వీసులో యిట్లాంటి మాటెప్పుడూ యినలేదే!" కాకా హోటలు వొకవైపు నుంచీ, ఫోటో స్టూడియో మరొక వైపు నుంచీ నెట్టడంతో బాగా చిన్నదైపోయిన పురోహిత పరిషత్ కార్యాలయం లోపల, వెలిసి రంధ్రాలు పడ్డ గోడకు వేలాడుతున్న అలివేలుమంగా వేంకటేశ్వరుల ఫోటోకు కింద, పూరాతత్త్వ ప్రదర్శనశాలకు చెందిన వస్తువులా కనిపిస్తున్న పాత టేబులు ముందు, చేతులూడిన కుర్చీలో కూర్చున్న వెంకటరమణ, దొర్రులుపడ్డ పలువరస వికృతంగా కనిపిస్తూండగా ఆశ్చర్యంతో నోరు తెరిచేశాడు. అతడి బట్టలు చాకలినీ, శరీరం స్నానాన్నీ, గడ్డం బ్లేడునూ మరిచిపోయి చాలా రోజులైపోయినట్టుగా కనిపిస్తున్నాయి.

చుట్టూ అన్నివైపుల నుంచీ వినిపిస్తున్న రకరకాల రణగొణ ధ్వనులు అతడి చెవిని సోకుతున్నట్టుగా కనిపించడంలేదు.

అసలే చిన్నదైన పురోహిత పరిషత్ కార్యాలయం, గోడలపక్కనంతా డోళ్లూ సన్నాయిలూ, అరటిపళ్ల గెలలూ, పెళ్లిపీటలూ, కంచు చెంబులూ కకావికలుగా నిండిపోవడంతో మరింత చిన్నదిగా కనిపిస్తోంది. గదినంతా కమ్ముకున్న మాడువాసన ముకుపుటాలకు తగలగానే ఆగంతకుడు పెద్దగా తుమ్మసాగాడు. గది ద్వారం దగ్గర మధుపర్కాల్లో నిల్చున్న యువతి తిరణాళలో తప్పిపోయిన పాపాయిలా బిత్తర చూపులు చూస్తోంది.

"అయితే ఆ గడప దగ్గిర నిలబడుకోనుండే పెండ్లికూతురు నీ పెండ్లాం కాదంటావా? " యింకా ఆశ్చర్యంలోనే మునిగి తేలుతున్న వెంకటరమణ మరో ప్రశ్న సంధించాడు.

ఆగంతకుడు కూడా వోసారి తలుపుల దగ్గర నిల్చున్న యువతిని నఖశిఖ పర్యంతం యెగాదిగా చూసి, "నా పెళ్లి జరిగిందేమో యీ అమ్మాయితో నేనండీ! కానీ యీ అమ్మాయెవరో సత్యప్రమాణంగా నాకు తెలియదు!" అన్నాడు.

వెంకటరమణ మరింతగా విభ్రాంతుడైపోతూ "ముక్కూ మొగం తెలియని పిల్లను పెళ్లెట్ల చేసుకున్నావు? అసలు పెండ్లికూతురు మారిపోయిందని తెలిసిందెప్పుడు నీకు?" అని అడిగాడు.

యింకా పొరబాటుకు కారణభూతుడైన వ్యక్తిని చూసినట్టుగానే వురిమి చూస్తూ "పౌరోహితుడు పసుపు బట్టలు కట్టుకు రమ్మని చెప్పినంత వరకూ పెళ్లి కూతురు మారలేదు. పెళ్ళయిపోయాక మంటపం దగ్గిరనుంచీ దర్శనానికి బయల్దేరాము. గుడిముందు దీపాల వెలుతుర్లో తిరిగి చూశాను. నాధోవతి కొంగుకు చీర కొంగు ముడిపెట్టబడ్డ అమ్మాయి ధనలక్ష్మిగాదు!" అన్నాడు ఆగంతకుడు.

యీసారి యేమని ప్రశ్నించాలో తోచక "మీరిద్దరే కనబడతా వుండారు. మీ పెండ్లికొచ్చిన మిగతా జనమంతా యెక్కడ?" అని వాకబు చేశాడు వెంకటరమణ.

"మాతోబాటూ పెళ్లికొచ్చిన వాళ్లు యిద్దరే! వొక భార్యా భర్తా. వాళ్లే సాక్షులుగా మీ రిజిస్టర్లో సంతకాలు చేశారు. యీ సందడిలో వాళ్లెక్కడో తప్పిపోయారు?" అని చెప్పాడు ఆగంతకుడు.

"తప్పోయినవాళ్లను వెదికిపట్టుకునేదానికి స్పెషల్ స్క్వాడు డిపార్టు మెంటుండాది..." మాట నోరు జారిపోయిన తర్వాతగానీ ఆ పని చేసినందువల్ల పెద్దగా లాభం వుండదన్న సంగతి వెంకటరమణకు తోచింది గాదు. "అక్కడెంతసేపని నిలబడతావు? యిట్లొచ్చి యీ బెంచీనపైన కూర్చో!" అంటూ పెళ్లి కూతుర్ని ఆహ్వానించాక... "నువ్వు కూడా కొంచెం శాంతం తెచ్చుకోని ఆ కుర్చీలో కూర్చోబ్బా! కావాలంటే రెండు గ్లాసులు నీళ్లు తాగు. యిది అర్రీబర్రీగా తేలే కథగా లేదు. తొలినించీ చెప్పు!" అన్నాడు వెంకటరమణ.

పాత కుర్చీ కిర్రుకిర్రుమని శబ్దం చేస్తూండగా కూర్చుంటూ "నా పేరు బంగార్రాజు. మాది తూర్పుగోదావరి జిల్లా రావూరు. యీ అమ్మాయి పేరు

జీవరత్న అట! నేను పెళ్లాడాల్సిన అమ్మాయిపేరు మాత్రం ధనలక్ష్మి!" అని సమాధానం చెప్పాడు బంగార్రాజు.

"యింకా పెండ్లికూతురు మాదిరిగా సిగ్గుపడతా అక్కడే నిలబడిపోతే యెట్ల తల్లీ?" అంటూ విసుక్కోబోయి, "అవును. నువ్వు గూడా పెండ్లికూతురే గదా!" అని నవ్వేసి, "యిట్లొచ్చి కూర్చోమ్మా!" అని జీవరత్నను హెచ్చరించాక "ధనలక్ష్మి అంటే యేమైనా పెద్ద సినిమాస్టారా? ఆ పిల్లెవురో నా కెట్ల తెలిస్తింది? యెక్కడ తప్పోయిందో యెతికినావా నువ్వు?" అంటూ చివరికి బంగార్రాజుకేసి మరో ప్రశ్నను విసిరాడు వెంకటరమణ.

"మీ పురోహిత పరిషత్ మండపాలన్నీ వెతికానండీ! మా వాళ్లు తప్పిపోయారని లౌడ్స్పీకర్లో ఠాంఠాం చేయించినాను. అన్ని ప్రయత్నాలూ ముగిశాకే యిలా మీ దగ్గరికొస్తున్నాను. మా వాళ్లందర్నీ మీ ఆఫీసు దగ్గరికే రమ్మని అనౌన్సు చేయించాను. మీ పరిషత్తువాళ్లు నిల్చోబెట్టి వెయ్యి రూపాయలు వసూలు జేసుకున్నారు గదా! యిరవై సెంట్లు కూడా లేని చోటులో యెందరొస్తే అందరికీ పెండ్లిండ్లు జరిపిస్తున్నారు గదా! యివ్వాళేమిటో మంచి ముహూర్తమని వొద్దంటే పెళ్ళిళ్లు. పుట్టలో యీసిళ్లలాగా మంటపాల నిండా జనమే! యెవరెవరమేయే పెళ్లి తాలూకు జనమో తెలియడంలేదు. వొక జట్టుతో యింకొక జట్టు కలిసిపోయింది. చాలనిదానికి మాకు తూర్పువైపు చోటు అలాట్ చేశారు. అటువైపంతా దీపాలు ఫీజులు పోయాయి. కొవ్వొత్తులు వెలిగించుకుని బ్రాహ్మణులూ, మంగలివాళ్లూ తూతూ మంత్రం పెళ్లి చేశారు. మేము మొత్తం వున్నది నలుగురమే! నేనూ, ధనలక్ష్మి, మా పెళ్లి చేయించడాని కొచ్చిన భూషయ్య బాబాయీ, చంద్రమ్మ పిన్నీ! కానీ మా నలుగురికీ గూడా చోటీయకుండా అటు పక్క వేరే పెళ్లిజనం గుమిగూడిపోయారు. మంగళ వాయిద్యాలొక వైపు, జనాల గడబిడ యింకొకవైపు.... గాలి గూడా చొరబడే చోటు లేదు. చెమటలు పోసి జనాలు వుక్కిరిబిక్కిరై పోతున్నారు..."

"అందుకనిచెప్పి హాలంతా యేసీ పెట్టించమంటావా నువ్వు? భలే పెద్దమనిషివేలే!" హుంకరిస్తూ బంగార్రాజు మాటలకు అడ్డు తగిలాడు వెంకటరమణ. "మీ రిచ్చిన వెయ్యి రూపాయల్లో బాపనోడికి నన్నూరూ, మంగలోళ్లకు నన్నూరూ పోతే మాకు మిగిలేది యిన్నూరే! ఆ మండపాల్ని రూములుగా కట్టి బాడిగకిచ్చినా అంతకంటే చానానే వస్తింది. యేందో దూరాభారం నించీ మీలాంటోళ్లు కొండమీద పెండ్లి చేసుకోవాలని వస్తారు గదా

అని మేం పుణ్యానికి పోతావుండాం. ఆ సంగతి సరేలే, మీ పెండ్లి కూతురు మా పెండ్లి మండపాల దగ్గిరే తప్పోయిందనేదానికి సాక్షికమేమేండాది?"

బంగార్రాజు గూడా యీ వ్యవహారాన్ని నింపాదిగా తేల్చకోక తప్పదని తెలుసుకున్నట్టున్నాడు. "చెప్పాను గదండీ! పసుపు బట్టలు కట్టుకోడం కోసం స్తంభం చాటు కెళ్లేవరకూ ధనలక్ష్మి మాతోనే వుంది. చాలాసేపటి వరకూ ఆమె వెలుపలికి రాలేదు. పౌరోహితుడు నాలుగైదుసార్లు హెచ్చరించాడు. అప్పుడు మా చంద్రమ్మ పిన్ని స్థంభం చాటుకెళ్లి బలవంతంగా ఆమె భుజం పట్టి యివతలికి లాగి, పెళ్లి పీటలపైన కుదేసింది. బహుశా అప్పుడు ధనలక్ష్మి అనుకొని యీ అమ్మాయిని తీసుకొచ్చి ఉండాలి!" అంటూ వివరించాడు.

"అవునా తల్లీ! అప్పుడేనా నువ్వు మారిపోయింది?" అని యీసారి జీవరత్నను ప్రశ్నించాడు వెంకటరమణ.

"స్థంభం యెనక పక్కకు పోయి పసుపు గుడ్డలు కట్టుకోమని నాకు చెప్పింది భూలోకానే! నేను గుడ్డలు మార్చుకుంటా వుండంగా చెయ్యి పట్టిలాగింది గూడా భోలోకా వాళ్లమనిషనే అనుకున్నాను..." అంది జీవరత్న తడబడుతున్న గొంతుకతో.

"పెండ్లి పీటలపైన నీ పక్కన కూర్చునుండే మనిషెవరో నీ కప్పుడు తెలియనే లేదా?"

"లేదు... భూలోకా వాళ్లమ్మ తల దించుకోని కూర్చోమని అప్పటికే నాలుగుసార్లు చెప్పింది. అందుకని నేను తల పైకెత్తి చూడలేదు."

"నువ్వు జూడకపోతే పోయినావనుకో! మీతో వచ్చుండే జనం గూడా చూడలేదా?"

"మా పెండ్లి జనానికి నేను కొత్త. అందురూ భోలోకా వాళ్ల జనమే! వాళ్లు నన్ను చూసింది గూడా యీ సాయంత్రమే!"

"అప్పుడే అనుకున్నాను. యిదేందో తగరారు బాపత్తు పెండ్లని. పెండ్లి కొడుకు జనం యీ సాయంత్రం దాంకా నిన్ను చూళ్లేదంటే యిదేందో తెలుసు కోవాల్సిన యవ్వారమే!" బీడీ ముట్టించి తాపీగా పొగ పీలుస్తూ అన్నాడు వెంకటరమణ.

జీవరత్న బంగార్రాజు వైపుకొకసారి వురిమి చూసి, ఆ తరువాత మెల్లగా పెదవి కదిపింది. "మాది కర్నూలు దగ్గిర మహానంది. భోలోకాదేమో తిరపతి పక్కన రంగంపేట. పంచాయితీ ఆపీసులో క్లర్కుగా మా వూరికి వచ్చినాడు.

పెండ్లికి వాళ్ల అమ్మా నాయినను వొప్పిస్తానని నాకు మాటిచ్చినాడు. ఆ ప్రకారంగానే పెండ్లి టయానికి వాళ్లందురూ యిక్కడికి చేరుకున్నారు..." యీసారి ఆమె గొంతుక యేడుపు ముంచుకురావడంతో జీరబోయింది.

"పెండ్లికొడుకు పక్కనుంచీ జనమొచ్చినారు. అయితే మీవైపు నుంచీ యెవురూ యెందుకు రాలేదు?" కళ్లెగరేసి అదోలా నవ్వుతూ అడిగాడు వెంకటరమణ.

జీవరత్న రెండు మూడుసార్లు గ్రుక్కిళ్ళు మింగాక "మా వాళ్ళకీపెండ్లి యిష్టంలేదు. మహానంది నుంచీ యెవురూరాలేదు." అంది.

"అదీ సంగతి! యిక్కడ పెండ్లిండ్లు చేసుకునే వాళ్ళల్లో చానామంది వాళ్ళయిండ్లల్లో చెప్పకుండా వుడాయించేసి వచ్చేవోళ్లే! అయ్యా, సామీ! నువ్వుగూడా ఆ బాపత్తే గదా?" మాటలతో బాటూ వెటకారపు నవ్వును మిళాయిస్తూ వెంకటరమణ క్రేంకారం చేశాడు.

"యే బాపత్తు పెళ్లో నీ కనవసరం!" టెబుల్‌పైన పెద్దగా శబ్దమొచ్చేలా వో గుద్దు గుద్దాక, వెంకటరమణకేసి వురిమి చూస్తూ అన్నాడు బంగార్రాజు. "ధనలక్ష్మి మైనారిటీ తీరిన అమ్మాయి. నేనూ మేజర్రే! మేం పెళ్లి చేసుకోవాలనుకుంటే కాదనేదెవరు? అదిగాదిప్పుడు కొచ్చిను. ఆరు మాసాలుగా వేచి చూసీ చూసీ, యింత కష్టమూ పడి, యిప్పుడు పెళ్లి చేసుకుందా మనుకుంటే, పెళ్లికూతురు మారిపోవటానికి కారణం యెవరండీ? మండపాల్లో సక్రమంగా దీపాలు వెలిగేట్టు చూసే బాధ్యత యెవరిది? యెందరు పడతారో అంతమందికి మాత్రమే చోటు కేటాయించాల్సిన పనెవరిది? యిప్పుడిలా కొంప మునిగిపోతే తప్పెవరిది? యిదేం ఆషామాషీ వ్యవహారం గాదు. పెళ్లి! పురోహిత పరిషత్తని పేరు పెట్టుకుని డబ్బులు మింగటం కాదు..."

జరిగిన పొరపాటుకు తమ నిర్లక్ష్యం కూడా కొంతవరకూ కారణమేనన్న సంగతి అర్థం గావడంతో కాస్సేపు వెంకటరమణ నీరసపడిపోయాడు. యింతలో తప్పిపోయిన వస్తువేదో చేతికి దొరికినట్టుగా తల పంకిస్తూ, " యిప్పుడీ పిల్ల యింకో పెండ్లి తాల్లూకూ నపురు గదా! అయితే వాళ్లెందుకు యీ పిల్లకోసరం యెతకడంలేదు?" అంటూ లా పాయింటును పైకి లాగాడు.

"అక్కడే వుంది మతలబు. పెళ్లి జరిగి యిప్పటికి రెండు గంటలవుతోంది. పెళ్లి కూతురు మారిపోయిందన్న సంగతి వాళ్లకీసరికి తెలిసే వుంటుంది. కానీ యింతవరకూ యిటువైపుకు వాళ్ళు తిరిగి చూడలేదు. కారణమేంటి?"

బంగార్రాజు కోపంతో నిలువునా వూగిపోతూ ప్రశ్నించాడు.

సమాధానమేం చెప్పాలో తోచక వెంకటరమణ బిక్కమొహం పెట్టాడు.

"ధనలక్ష్మి అంటే అలాంటిలాంటి అమ్మాయనుకుంటున్నారా?" బంగార్రాజు అదే ధోరణిలో కొనసాగించాడు. "యిరవై ఆరు కారెట్ల బంగారం. వాళ్ల బాబెవరో తెలుసా? వెంకట్రావంటే ఆ వూర్లోనే యెత్తిన చెయ్యి. అయిదారెకరాల మోతుబరి రైతు. పెరటినిండా ఆవులూ, గేదెలూ, అంతా పెద్ద వ్యవసాయం. వొకతే కూతురు. బహుశా యీసరికి వాళ్లకీ సంగతి తెలిసుంటది. అప్పనంగా అంత ఆస్తితోబాటూ అమ్మాయి దొరికితే వదులుకునే వాళ్లెవరుంటారు? గుట్టు చప్పుడు కాకుండా పిల్లతో గూడా వుడాయించేసి నట్టున్నారు వాళ్లు!"

రెండు మూడు నిముషాలు ఆలోచించిన తర్వాత "అయితే ఆ పిల్లకు బాగా ఆస్తి వుందని తెలిసి ఆ పెండ్లోళ్లు కంప్లయింటు చెయ్యలేదంటావు. కానీ నువ్విక్కడ యింకొక సంగతిని మరిచిపోయినావు. ధనలక్ష్మి అనే ఆపిల్ల మిఠాయి పొట్లం మాదిరిగా వస్తువేమీ గాదు. కాళ్లూ చేతులూ అన్నీ సక్రమంగా వుండే మనిషి. యిష్టం లేని మనిషిని మొగుడని ఆ పిల్లెట్ల వొప్పుకుంటుంది?" అని అడిగాడు వెంకటరమణ.

"అంటే యిష్టపడే వాళ్లతో వెళ్లిపోయిందంటావా?" బంగార్రాజు కీసారి చెప్పలేనంత కోపం వచ్చింది. లేచి నిల్చుని, రెండు చేతుల్నీ టేబులు పైన వూతగా పెట్టుకుని ముందుకు వంగి, వెంకటరమణ ముఖంలోకి ముఖం పెట్టి చూస్తూ అతను తూటాలలాంటి మాటల్ని రువ్వసాగాడు. "ధనలక్ష్మంటే అందరిలా పోకిరీ వేషాలేసే అమ్మాయనుకున్నారా? ఎంతో గుట్టయిన అమ్మాయి. ఆమె గొంతెలాగుంటందో వూళ్లో వున్న మగ పిల్లల కెవరికైనా తెలుసా? యింటిదగ్గర తల వంచుకుందంటే తర్వాత తల పైకెత్తడం యింటికి తిరిగొచ్చాకే గదా! ఆమె పేరుతో ఆస్తి దండిగా వుందని వూళ్లో యెందరు వలపన్నుక్కూర్చున్నారు! యెవరికైనా రవంత సందు దొరకనిచ్చిందా?"

యీసారి వెంకటరమణ అంతగా కంగారుపడలేదు. "అట్లాంటి పిల్ల యింట్లో వాళ్లకు తెలియకుండా నీతోబాటూ యింతదూరం యెందుకొచ్చినట్టు?" అన్నాడు వెటకారంగా.

బంగార్రాజు అలసిపోయినవాడిమల్లే కుర్చీలో కూలబడ్డాడు. పైసవకంతో ముఖంపైని చెమట బిందువుల్ని తుడుచుకున్నాడు. వంచిన తల పైకెత్తకుండా

చెప్పసాగాడు. "పెళ్లి కూతురు మారిపోయిందని మీతో కంప్లయింటిస్తున్నానని నన్ను శుద్ధదద్దమ్మని అనుకుంటున్నారు గదా! వట్టి చేతుల్తో వూరుగాని వూరికి చేరినవాణ్ణి. యెలా కష్టపడ్డానో, యెలా కూడబెట్టానో యెవరికి తెలుసు? పల్లెరెడ్డిగా పుట్టినవాణ్ణి. హోటలు వ్యాపారం వీడేం చేస్తాడులే అన్నారు గదా అందరూ. వొకటి రెండేళ్లలో యేం జరిగింది? ప్రతిరోజూ సాయంకాలానికల్లా నూరు నూట యాభై వరకూ నా చేతిలో ఆడుతోంటే వూళ్లోవాళ్లే నోరు తెరిచేశారు గదా! నాలాంటి చాకయిన కుర్రాడు వూళ్లో మరొకడు లేడని అందరూ వొప్పుకున్నారు. తెలుసా?"

"అయితే ఆ పిల్ల వూళ్లో వాళ్లందరినీ కాదని, నీ తెలివితేటల్ని చూసి నిన్ను వలచిందంటావు!" వెంకటరమణ కుతూహలాన్ని అణచి పెట్టుకోలేకపోయాడు.

"అదేమంత సులభంగా జరిగిన వ్యవహారం గాదు. రెండేళ్లుగా వాళ్ల యింటి ముందే టీ హోటలు నడుపుతోంటే ధనలక్ష్మి నా వైపైనా కన్నెత్తి చూసిందంటారా? లేదే? టిఫిన్లూ కాఫీలు సరఫరా చేసినా ఆ అమ్మాయి మనసు మెత్తబడ్డదా? గడచిన సంక్రాంతి పండుగ రోజునే గదా ఆవిడ నాతో మాటా మాటా కలపడం? టౌను నుంచీ కావాలన్నదల్లా తీసుకొచ్చి పెట్టానా లేదా? యెన్ని బహుమతులూ, యెంత ఖర్చూ! అయినా పెళ్లి మాటన్నప్పుడల్లా కంగారుపడ్డమే గదా! ఆమెను వప్పించడానికి దేవుడే దిగొచ్చాడు. కొండమీద పెళ్లి జరిపించాలన్న మొక్కుందని అన్నప్పుడు నేను కాదన్నానా? చివరికేమయింది? నా కష్టాన్నంతా యెవరో తన్నుకెళ్లిపోయారు గదా! యిందుకు మీ చీకటి మండపాలే గదా కారణం? మిమ్మల్ని వూరికే వదులుతా ననుకోకండి!" మళ్లీ కోపంతో పళ్లు పటపటలాడించాడు బంగార్రాజు.

అతడి కోపాన్ని సరకు చేయనన్నట్టుగా మరో బీడీని రంగిలించుకున్నాడు వెంకటరమణ. తరువాత "కన్న తల్లిదండ్రులకు తెలియకుండా యెవుడో ముక్కూ మొగం తెలియనోడితో యీ మాదిరిగా వచ్చేసేది తప్పు గదా?" అంటూ తన దృష్టిని జీవరత్న వైపుకు మర్లించాడు.

చిగురుటాకులా నవనవలాడుతున్న జీవరత్న చురకత్తుల్లాంటి పదునైన చూపుల్ని సారిస్తూ, "భూలోకా ముక్కూ మొగం లేని మనిషి గాదు..." అంది కరకుగా. "వాళ్లకు గూడా వాళ్ల వూళ్లో భూములుండాయి!" అంటూ ముక్తాయించింది.

"మీ నాయినేం జేస్తాడు?" సహేతుకమైన కారణంకోసం వెతుకుతున్నాడు

వెంకటరమణ.

"వ్యవసాయమే! యిరవై రెండెకరాలుంది మడి. మా అమ్మా, నాయనకు నేనూ వొకతే సంతు!"

"రెండు పక్కలా బాగా వుండేవాళ్లే గదా! పెద్దోళ్లను వొప్పించి పెండ్లి చేసుకోవచ్చు. యీ మాదిరి దొంగతనంగా యెందుకు పెండ్లాడాల?" వెంకటరమణకు వొకదాని వెంటవొకటిగా సందేహాలు పుడుతూనే వున్నాయి.

"మా యిద్దరిదీ వొక కులం గాదు. భూలోకావాళ్లు నాయుళ్లు. మేము బలిజోళ్లం!" చెబుతున్న వర్తమానంతో తనకేమీ సంబంధం లేనట్టుగా యథాలాపంగా జవాబు చెప్పింది జీవరత్న.

"యీ పెండ్లికి ఆ భూలోకనాయుడి తరపున్నించీ మాత్రం బంధువులు వచ్చినారంటివి గదా? వాళ్లు మా పెండ్లికి యెందుకభ్యంతరం చెప్పలేదు?"

"మొదట్లో వాళ్లు వొప్పుకోలేదు. మా భూలోకనాయుడే వాళ్లను బలవంతంగా వొప్పించినాడు."

తన ప్రాసిక్యూషన్ ముగిసినట్టుగా వెంకటరమణ కాస్సేపు మౌనంగా వుండిపోయాడు. అతడికెదురుగా కూర్చున్న బంగార్రాజు సైతం శాంతించి నట్టుగా కనిపిస్తున్నాడు.

కిటికీలోంచీ కనిపిస్తున్న విశాలమైన వీథిలో యిసుకేస్తే రాలనంత మంది జనం గుమిగూడిపోయి వున్నారు. రాత్రి పన్నెండు గంటలు కావస్తున్నా వీధికిరువైపులా వున్న అంగళ్లలో బేరసారాల వుద్ధృతి తగ్గలేదు. వీధికి పడమటివైపున్న ఆస్థాన మండపంనుంచీ వెలువడుతున్న హరికథ జనాలనేమీ ఆకర్షించలేకపోతోంది. దారి తప్పిన బాటసారి ఆక్రోదనలా గుడిలోంచీ మంగళవాయిద్యం స్పష్టాస్పష్టంగా వినబడుతోంది. పురోహిత పరిషత్తు కార్యాలయం ముందునుంచీ వీథిలోకి దారితీస్తున్న మెట్లవరసకు పక్కన, పెద్ద యినుప తలుపుల గుమ్మం కనిపిస్తోంది. లోపలివైపున వున్న పెళ్లి మంటపాల నుంచీ వచ్చిపోయే జనాలతో అది తేనె తుట్టెలా తత్తళించిపోతోంది.

కార్యాలయం పక్కనున్న టీ హోటల్లో బాయిలర్ ముందు, పెద్ద పెద్ద మీసాలున్న పహిల్వానులాంటి వ్యక్తి టీ కలుపుతున్నాడు. "యిదిగో గోయిందరాజులూ! ఆ యెలక్ట్రీషియన్ కనిపిస్తే యిట్ల రమ్మను!" అంటూ అతడికో సందేశాన్ని సరఫరా చేశాక "అట్నే మీ పిల్లోడి దగ్గిర మూడు టీలు అంపించు!" అన్నాడు వెంకటరమణ.

టీ గ్లాసులు తమముందుకొచ్చే వరకూ అందరూ మౌనంగా వుండిపోయారు.

సగం గ్లాసు పూర్తిచేసిన తరువాత "అక్కడా కులాలు వేరే వేరే! యిక్కడా అంతే! రెండూ వొకేమాదిరిగా దొంగ పెండ్లిండ్లే!" అంటూ స్వగతంలా గొణుక్కుని, అదేదో జోక్ అయినట్టుగా నవ్వేశాడు వెంకటరమణ. టీ గ్లాసులోని మిగిలిన ద్రవాన్ని ఖాళీ చేయగానే అతడి మెదడులో మెరుపులా మరో ఆలోచన తట్టింది. "యిప్పుడు జీవరత్నమయితేనేమి? ధనలక్ష్మి అయితేనేమి? మేరేజెస్ ఆర్ మేడిన్ హెవెన్ అంటారు. మీ కిద్దరికీ యీ విధంగా దేవుడు రాసి పెట్టుంటాడు. అందుకే ఆ పెండ్లి కూతురుతో వాళ్లు కిముక్కుమనకుండా వెళ్లిపొయ్యుంటారు!" సమాధాన మేమంటారన్నట్టుగా వాళ్లిద్దరికేసి పరీక్షగా చూశాడు వెంకటరమణ.

ఖాళీ టీగ్లాసును టేబులుపైన వుంచుతున్న బంగా[్రాజు పెదవుల్లోంచీ "తూర్పు గోదారి జిల్లాలో ఆరెకరాలకూ, కర్నూలు జిల్లాలో యిరవై యెకరాలకూ తేడా లేదా?" అన్న మాటలు గులకరాళ్లల్లా యివతలకి పడ్డాయి.

"చూడు బంగా[్రాజూ! నువ్వేందో కోర్టూ పోలీసులూ అంటావుండావని నేను బయపడతాననుకుంటా వుండావేమో! జరిగిందాంట్లో మా తప్పేమీ లేదు. కానీ వొక మాట చెప్తాను విను. మంచి మాట యెవురు చెప్పినా వినాల. మీ తూరుపుగోదావరి జిల్లాను నేనుగూడా చూసినాన్లే!" వెంకటరమణ యీ సారి పెద్దగానే నవ్వేశాడు. "నువ్వెప్పుడైనా కర్నూలు జిల్లాలో మహానంది దగ్గిరుండే మడిచెక్కను చూసినావా? మీ కోనసీమ భూములు కూడా వీటిముందు పనికిరావు!" వెంకటరమణ జీవరత్నవైపుకు తిరిగాడు. "యే రకంగా చూసినా దేవుడు నీకు మేలే చేసినాడు. తుమ్మితే వూడిపోయే ముక్కుతో యెంతకాలమని యేగతావు? యీ బంగా[్రాజును చూడు, వూరు దూరమే గావచ్చు. వుద్యోగం లేదనుకో! అయితే యేమి? జమ్మని సొంతంగా హోటలు పెట్టుకున్నాడు. కావాలంటే మీ వూరికే వచ్చేస్తాడు. ఆ భూలోకనాయుడిలాంటి వాళ్లు నలుగురికి జీతం యిస్తాడు. అంతెందుకు? యింత జరిగినా నిన్ను నడిదార్లో దిగ్గొలకలేదు!"

జీవరత్న సమాధానమేమీ చెప్పలేదు. కానీ యీ సారి తన చూపుల కడ్డంగా సజీవ పదార్థమేదో అడ్డు తగిలినట్టుగా ఆమెకు తోచింది. ఆమె కళ్లల్లో సన్నటి మెరుపు రేఖ మెరిసింది. బంగా[్రాజు సైతం జీవరత్న వైపు ఆసక్తితో పరకాయించి చూడసాగాడు.

"పిల్ల లక్షణంగా వుండాది. పెండ్లాడినోడికి లక్షణమైన ఆస్తి గిట్టు బాటవతాది. వస్తా వస్తా నక్కతోక తొక్కొచ్చినట్టుండావు. ఆలోచించుకో బంగార్రాజూ, వూరికే గొడవపడితే నీకు గానీ, నాకు గానీ వచ్చే లాభం లేదు. నువ్వూ బాగా ఆలోచించుకోని చూడు జీవరత్నమ్మా! పిల్లోడు కంటికి నదురుగా వుండాడు. బంగారట్టా యాపారం. నువ్వు సెలెక్ట్ చేసుకున్నోడి మాదిరిగా యేరు దాటంగానే తెప్ప తగలేసేవాడు కాదు. కావాలంటే యిద్దరూ మాట్లాడుకోండి. నేనా పక్కకు పోయి మండపాల దగ్గిర బల్బులు తగిలించేసి వస్తాను!" యిద్దరికీ సూచనలిచ్చాక వెంకటరమణ మెట్లు దిగి పెండ్లి మండపాలలోకి వెళ్లిపోయాడు.

యెవరు ముందుమాట్లాడుతారా అని పందెం వేసుకున్నట్టుగా నూతన వధూవరులిద్దరూ కాస్సేపు మౌనంగా వుండిపోయారు.

పురోహిత పరిషత్ కార్యాలయపు కిటికీలోంచీ, రోడ్డుపైన కిటకిట లాడుతున్న జన సమూహం స్పష్టంగానే కనబడుతోంది. కింద మంటపాల ద్వారం దగ్గర నిల్చున్న గుంపులోంచీ, కొత్తదంపతులకు చీకటి ఆకాశంలో అరుంధతిని వెతుక్కోమని సవాలు విసురుతున్న పురోహితుడు కూడా స్పష్టంగానే కనబడుతున్నాడు. ఆ గుంపును ముందుకు నెడుతున్నట్టుగా మరో సమూహం ముందుకు కదులుతోంది. ఆస్థాన మండపం నుంచీ హరిదాసు పాడుతున్న మంగళకీర్తన స్పష్టంగానే వినపడుతోంది.

చివరకు తానే వోడిపోయినట్టు అంగీకరిస్తున్నట్టుగా "యింటికెళ్తే మీ వాళ్లేమీ అనరా?" అని అడిగాడు బంగార్రాజు.

"యెందుకనరు? నే నీ సంగతి వాళ్లకు యెప్పుడో చెప్పేసినాను. వాళ్లు గోడుగోడుమన్నారు. అయినా పెళ్లాడేది వాళ్లా, నేనా? నా యిష్ట ప్రకారం నేను పెళ్లి చేసుకునే దానిలో వాళ్ల ప్రమేయమేముంది?" అందామె మెల్లగా.

"పెళ్లయ్యాక ధైర్యంగా యిద్దరూ యింటికే వెళ్దామనుకున్నారా?"

"మా యింటికి కాక యింకేడికి పోతాం? ముందుగా మా అమ్మా, నాయినా అరిచి రాద్ధాంతం చేస్తారేమో! అంతమాత్రానికే బెదిరిపోవాల్నా? నా దగ్గిర ఆ పప్పులేం వుడకవు. మా యింట్లో నేనెంత చెప్తే అంతే!"

బంగార్రాజు కళ్లార్పడం సైతం మరచిపోయి జీవరత్నవైపే చూస్తున్నాడు. నలిగిన పసుపు బట్టల్లో ఆమె శరీరం ఆకులు విప్పుకున్న అరటి బోదెలా కళకళలాడుతోంది. ఆమె చూపులు తన చూపులతో భేటీ పడగానే అతడు దృష్టిని మరల్చుకుంటూ, "ఆడ పిల్లలు గూడా అలా ధైర్యంగా వుండాలి.

ధనలక్ష్మికి చెప్పి వప్పించడానికి తల ప్రాణం తోకకొచ్చింది. యిక్కడి కొచ్చాక కూడా వాళ్లమ్మా బాబుల్ని తలుచుకుని యేడుస్తూనే వుంది..." అని కాసేపాగి, "మాది అసలు వొంగోలు జిల్లా మాచవరం. కర్నూలు జిల్లాలో మాకు బంధువులు దండిగా వున్నారు!" అన్నాడు.

చెప్పులు టపటపలాడించుకుంటూ వెంకటరమణ గదిలోకొచ్చాడు. "నా బీడీ కట్టను యిక్కడెక్కడో పెట్టి మరిచిపోయినాను!" అంటూ టేబులు చుట్టూ తిరగసాగాడు.

అతడి వెనకే మెట్లెక్కి వచ్చిన ఆగంతకుడు "సార్! సార్! యిక్కడ ఆఫీసులో వుండేది మీరేనా?" అని అడిగాడు ఆందోళనతో తడబడుతున్న గొంతుకతో.

అయితే యేమంటావన్నట్టుగా తిరిగి చూశాడు వెంకటరమణ.

"మీ రిజిస్టర్లో మా పెళ్లి కూతురు పేరు తప్పుగా యెంట్రీ పడింది. కొంచెం దాన్ని సరిదిద్దాల!" అన్నాడతను.

"పెండ్లి జరిగిందెప్పుడు? పేర్లేమి?" కుర్చీలో కూర్చుని రిజిస్టరు తిప్పుతూ అడిగాడు వెంకటరమణ.

"అబ్బాయి పేరు భూలోకనాయుడు. అమ్మాయి పేరు ధనలక్ష్మి అని వుండాల్సింది. జీవరత్న అని రాసేసినారు పొరబాటున..."

బక్కెట్టు నీళ్లు తలపైన దిమ్మరించినట్టుగా వెంకటరమణ నిటారుగా కూర్చున్నాడు. ఆగంతకుడికేసి చిలిపిగా చూస్తూ, "పేరు తప్పయ్యిందా? పెండ్లి కూతురు మారిపోయిందా?" అని ప్రశ్నించాడు.

"యీ సంగతి అప్పుడే మీ దాంకా వచ్చేసిందా సార్!" ఆగంతకుడు ఆసురుసురంటూ చెప్పసాగాడు "యేం చెయ్యమంటారు? మా కొడుకు వొట్టి యామాళం. చూసీ చూసీ మగ రాయుడిలాంటి పిల్లను కానరాని దేశం నుంచీ తీసుకొచ్చి పెండ్లి చెయ్యమని కూర్చున్నాడు. ఆ పిల్లకు అణకవే లేదు. మాటకు మాట. కుదురూ బెదురూ లేదు. యిట్లాంటి పిల్ల నీతో యెట్ల సంసారం జేస్తిందిరా అని నా పెండ్లాం మొత్తుకునింది. వాడింటే గదా! కానీ యీ కొండపైనుండే దేవుడుండాడే సార్! భలే మహత్యముండే దేవుడు. సరిగ్గా టయానికి పెండ్లి కూతుర్నే మార్చేసినాడు. పెండ్లి కావడం నేరుగా జీబులలో కెక్కి కొండ దిగేసినాం. చెపితే నమ్మరు గానీ, అప్పుడు గానీ పెండ్లి కూతురు మారిపోయిందనే సంగతి మాకు తెలియలేదు. జీబులో పొయ్యేటప్పుడు యీ

పిల్ల యింత సంసారపాగ్గా వుందేమిరా అని నేను గూడా ముక్కుపైన వేలేసుకున్నోడ్నే! ఆ తర్వాతే గదా తెలిసింది నిజెం. అంత ఆస్తీ పాస్తీ వుండే పిల్లే అయినా యీ పిల్ల యెంత వినయం! యెంత సాంప్రదాయం! మొత్తానికి మా ఆడోళ్లు మొక్కుకున్నట్టుగా బుద్ధిమంతురాలైన కోడలొచ్చింది. అదే చాలు!"

"నువ్వు కోడలొచ్చిందని భుజాలెగరేస్తే సరిపోయిందా పెద్దాయినా? నీ కొడుకును నమ్ముకోని యింత దూరం వచ్చిన ఆడకూతురు గతేం కావాల?" వెంకటరమణ కోప్పడసాగాడు.

"ఆ పిల్ల సంగతి మీ కేం తెలుసు సార్! గుడినీ, దేవుడ్నీ రెండిట్నీ అమ్మేసి వూరికి పోయే రకం. అయినా యిది దేముడి ముందర జరిగిన పెండ్లి. కాదనేదానికి మనమెంత సార్! అదో! మా పెండ్లి జరిపించిన బాపనాయన గూడా వచ్చినాడు చూడండి టయానికి. బాపనాయిన సాక్షికమంటే బగమంతుడి సాక్షికమనే గదా అర్థం!" ఆగంతుకుడేమీ బెంబేలు పడటంలేదు.

అప్పుడే గదిలోకి అడుగు పెట్టిన వ్యక్తికేసి చూసి "నీ తెలివి తెల్లారినట్టే వుండాది. వీడేంది, బాపనోడేందీ?" అంటూ నవ్వేశాడు వెంకటరమణ. "పెండ్లి కూతురు చీకట్లో మారిపోయిందని దబాయిస్తా వుండావు గదా! అయితే పురోహితుడికీ మా అటెండరుకూ గూడా తేడా తెలియలేదా నీకు?"

అదేమంత పెద్ద విషయం గాదన్నట్టుగా ఆగంతకుడు నవ్వేశాడు. "మీ పరిషత్తోళ్లు పంపించిన మనిషయితే మా కంతే చాలు! వాడు బాపనోడో కాదో తెలుసుకునే పని మా కెందుకు? మీరు కొంచెం ఆ పేరు మార్చేయండి. తర్వాత యెట్ల పోయి యెట్లొస్తిందో యెవురికి తెలుసు? మా కోడలు పేరు ధనలక్ష్మి!" మాట్లాడుతూనే వొక పచ్చ నోటు పైకి తీసి వెంకటరమణ చేతిలో పెట్టి, "మీ కష్టం పెట్టుకునే మనిషి గాదు నేను, ఆ పురోహితుడికి గూడా కొంచెం యియ్యండి!" అన్నాడతను.

వెంకటరమణ బంగార్రాజుకేసి తిరిగి చూశాడు. అతను ఆత్రుతతో అటువైపే కళ్లార్పకుండా చూస్తున్నాడు. జీవరత్నం మాత్రం జరుగుతున్న తతంగంలో తన పాత్రేమీ లేనట్టుగా ముఖం అవతలికి తిప్పుకుని వుంది. రిజిస్టరులో పేరును సరిదిద్దే పనిలోకి దిగసాగాడు వెంకటరమణ. ఆగంతకుడు వొక నమస్కారాన్ని విడిచిపెట్టి వెళ్లిపోయాడు.

"యేరా బ్రహ్మయ్యా! యీ యాపారం యెప్పుటి నుంచీ మొదలు పెట్టినావబ్బా!" అన్నాడు వెంకటరమణ పచ్చనోటును నింపాదిగా జేబులోకి

నెడుతూ.

"జమ్మని ఆఫీసుకుర్చీలో కూర్చొని ఆర్డర్లు జారీ చేసేవాళ్లకు మా బాధలేం తెలస్తాయిలేన్నా! వచ్చినోళ్లకంతా బాపనోళ్లనీ, మంగలోళ్లనీ సప్లయిజెయ్యాల్నా! వొకొకసారి వొద్దంటే జనం వచ్చి పడిపోతారు. పెండ్లి జరిపించే తీరాలంటారు. బాపనోడు ఖాళీ లేడంటే వింటారా వాళ్లు? కొంత మందయితే కొట్టను కొట్టనొస్తారు. మా డ్యూటీ చేసేది యెంత కష్టమో నీకేం తెలుసు? అప్పుడప్పుడూ యిట్లా తాసికలు మాసికలు చెయ్యకపోతే గత్యంతరం లేదు..." అన్నాడు బ్రహ్మయ్య.

బంగార్రాజు పైకి లేచి, తన జేబులోంచీ వొక పచ్చనోటును పైకి తీసి వెంకటరమణ ముందుంచుతూ "మీ అటెండర్ని బ్రాహ్మడనుకుని మొదట కాళ్లావేళ్లా బడ్డది నేనే గదా సార్! యింతలో వేరే బ్రాహ్మణుడొచ్చాడు కాబట్టి సరిపోయింది. లేకపోతే మా పెళ్లి గూడా యీయన చేతులపైనే జరిగేది. యెంతలో యెంత ప్రమాదం తప్పిందో చూడండి. యెంతయినా పెద్దవాళ్లు చెప్పే మాటలు తప్పుగాదు సార్! మీరు చెప్పినట్టు పెళ్లిళ్లనేవి స్వర్గంలోనే తయారవతాయి!" అన్నాడు హుషారుగా.

వెంకటరమణ చేతిలోని పచ్చనోటును అలవోకగా తన గుప్పిటలోకి లాక్కుని, "ఆ సంగతి నాకు తెలియదు. పెండిండ్లు మా పురోహిత పరిషత్తులో జరగతాయనేది మాత్రం రూపాయికి పదారణాలన్నంత నిజం!" అంటూ మెట్ల దగ్గరికి గెంతాడు బ్రహ్మయ్య.

పురోహితపరిషత్ కార్యాలయంలోంచీ యేదో అడుగుతున్న వెంకటరమణ మాటలు పెళ్లి మండపాలలోకి దూరేసిన బ్రహ్మయ్య చెవిన పడనేలేదు.

*(13 సెప్టెంబరు 1999, ఆంధ్రప్రభ సచిత్రవార పత్రిక)*

❖ ❖ ❖